ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 29 జనవరి 2025 | 3





తూర్పుగోదావరి జిల్లా



రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా



అమలాపురంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు

కాకినాడ జిల్లా



పిఠాపురంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ఎన్ వర్మ

అక్షర.. వారధి!

అక్షరం ఏం చేయగలదు!? ప్రతి రోజూ పాఠకులకు తాజా తాజా వార్తలు చేర వేస్తుంది..అంతే..! ఇది నిన్నటి వరకూ ఉన్న ఒక వాదన.. అదేం కాదు..? 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' అక్షరం ఏం చేయగలదో నిరూపించింది.. జనగళమై ప్రజలకు ప్రజా ప్రతినిధులు . అధికారులను చేరువచేసింది.. వారధిగా మారి ప్రజా సమస్యల గళం వినిపించింది.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వర నగర్, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మూడో వార్డు, కాకినాడ జిల్లా పిఠాపురం 18వ వార్డులో మంగళవారం ఉదయం అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా సభలను నిర్వహించారు. ఈ సభలకు పెద్ద ఎత్తున జన స్పందన లభించింది.. ఆయా ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో జనం హాజరై సమస్యల గళమెత్తారు. రాజమహేంద్ర వరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, అమలాపురంలో కమిషనర్ రాజు, పిఠాపురంలో టీడీపీ ఇన్‌చార్జి వర్మ, కమిషనర్ కనకారావు వాటిని విని పరిష్కరిస్తామని అక్కడికక్కడే హామీలు ఇచ్చారు.



అక్షరం కదిలించింది.. అండగా నిలిచింది!



చర్చా వేదికకు హాజరైన వార్డు ప్రజలు



మాట్లాడుతున్న కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు

సమస్యలు విన్నారు.. పరిష్కారం చూపారు..



సమావేశంలో మాట్లాడుతున్న అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, పక్కన మెట్ల రమణబాబు తదితరులు

అమలాపురం 3వ వార్డులో ప్రజా సమస్యలపై చర్చా వేదిక

అమలాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని 3వ వార్డులో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా మంగళవారం ఉదయం వేపచెట్టు కనకదుర్గమ్మ ఆలయ సన్నిధిలో స్థానిక సమస్యల పరిష్కారంపై చర్చా వేదిక జరిగింది. ఆసక్తికరమైన అంశాలతో పాటు ప్రధాన సమస్యలను సభకు హాజరైనవారు ప్రస్తావించారు. అతిథులు, అధికారులు సైతం వాటిపై పరిష్కారం దిశగా అడుగులు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు హామీలు ఇచ్చారు. గంటన్నర సేపు జరిగిన చర్చావేదికలో 140 మందికి పైగా వార్డు ప్రజలు హాజరయ్యారు. ఈ చర్చా వేదికకు ఆంధ్రజ్యోతి రాజమహేంద్రవరం ఎడిషన్ ఇన్‌చార్జి మంగేష్ అధ్యక్షత వహించారు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు మధ్య వారధిగా ఉంటూ ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి తోడ్పడే దిశగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజాసమస్యలను ప్రతిబింబింపచేసిన వార్డు ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ చర్చావేదికలో ప్రజలు ప్రస్తావించిన అంశాలపై మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు పరిష్కారం కోసం తీసుకునే చర్యలను సుదీర్ఘంగా వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు మాట్లాడుతూ ముందుగా మనలోనే మార్పు రావాలని, మన ఇల్లు, మన వాకిలి బాగుంటే చాలు. పక్కిల్లు ఎలా ఉంటే ఏమిటి అనే ధోరణి సరికాదన్నారు. తుడిచేసిన చెత్తంతా డ్రైన్లలో పోసేస్తున్నారని చెప్పారు. దీంతో డ్రైన్లలో మురుగునీరు పారక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొంతమంది స్వార్థంతో మున్సిపాలిటీ స్థలాల్లోకి వచ్చేసి కట్టడాలు కట్టేస్తున్నారు. చివరికి ఫైర్ ఇంజను, అంబులెన్సులు వస్తే దారి ఇచ్చే పరిస్థితి కూడా లేకుండా పోతోందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి అక్రమ నిర్మాణాలు ఏమైనా ఉంటే నిర్దాక్షిణ్యంగా కొట్టేయండని కోరారు.. రోడ్లపైకి వచ్చిన ర్యాంపులన్నీ తొలగించేయండి ఏ ప్రజాప్రతినిధి కూడా అడ్డు రారు అన్నారు. పందులు, కుక్కలు, దోమల బెడద లేకుండా చూడాలని కోరారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో హిందూ శ్మశాన వాటికను ప్రత్యేకంగా అభివృద్ధి చేశామని, డంపింగ్ యార్డుకు చెత్తను తరలించకుండా శ్మశాన వాటిక ఎదురుగాను, రోడ్లపక్కన, కాల్వల చెంతన పడవేయడంతో కాల్వనీరు కూడా కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు మాట్లాడుతూ వార్డులో ప్రధానంగా ప్రజలు అడిగిన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. శ్మశాన వాటిక సమస్య కూడా త్వరలోనే పరిష్కరిస్తామని, దోమల బెడద నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. 3వ వార్డు కౌన్సిలర్, జనసేన మున్సిపల్ ప్రతి పక్షనేత యేడిద శ్రీను మాట్లాడుతూ వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కలుషిత నీరు కుళాయిల్లో వస్తుందని, ప్రజలు ఎదుర్కొంటున్న కుక్కల బెడదను, డ్రైనేజీ, దోమల నివారించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రైనేజీల కిందే మంచినీటి పైపులైన్లు ఉండడం వల్ల కలుషిత నీరు వస్తున్న దృష్ట్యా కమిషనర్ ఆ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని యేడిద విజ్ఞప్తి చేశారు. నల్లవంతెన వద్దనున్న శ్మశాన వాటికను పునరుద్ధరించాలని కోరారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతిధుల దృష్టికి తీసుకువెళ్లేలా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చేపట్టిన కార్యక్రమం భవిష్యత్తులో ఎంతో సత్ఫలితాలను ఇస్తుందన్నారు. వార్డులో దోమల బెడద చాలా విపరీతంగా ఉందని దోమల నివారణకు చర్యలు చేపట్టి ప్రజలు ప్రశాంతంగా పడుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. చర్చావేదికలో మాజీ కౌన్సిలర్, టీడీపీ నేత దున్నాల దుర్గ, సీనియర్ నాయకుడు నల్లా స్వామి, వార్డు టీడీపీ అధ్యక్షుడు చవటపల్లి రఘు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు గోకరకొండ హరిబాబు, బొర్రా ఈశ్వరరావు, వలవల శివరావు, చింతలపూడి సత్తిబాబు, యాళ్ల గంగాధరరామారావు, గంధం శ్రీను, నల్లా మల్లిబాబు, అన్యం స్వామి, నిమ్మన ఉదయ్, మెండా రవి, పడాల బాబు, దున్నాల వేణుతో పాటు ఆంధ్రజ్యోతి సంస్థ తరపున ఆచంట వెంకట్, జి.ప్రకాష్, అడపా శ్రీను, కె.ప్రవీణ్, ఉండపల్లి సతీష్‌తో పాటు పురపాలక సంఘంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి మంగేష్

ఆద్యంతం అర్థవంతంగా సాగిన చర్చ

సమస్యలను నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చిన వార్డు ప్రజలు

ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్యలపై గగ్గోలు

పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజల వేడుకోలు

సమస్యల పరిష్కారానికి కమిషనర్ రాజు హామీ..

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో 3వ వార్డులో నిర్వహించిన చర్చావేదికలో ప్రజలు ప్రస్తావించిన ప్రధాన సమస్యలపై పరిష్కార ప్రణాళికలను మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తన ప్రసంగంలో వివరించారు. డ్రైన్లలో చెత్త వేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. 'మున్సిపల్ అధికారులు దోమల నివారణకు చర్యలు తీసుకుంటారు. ఇందుకు మీ సహకారం కూడా కావాలి. కుక్కల బెడద వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ.10 లక్షల ఖర్చుతో ఒక ఆపరేషన్ థియేటర్, ఇతర సౌకర్యాలు ఏర్పాటుచేసి కుక్కల సంతానోత్పత్తి పెరగకుండా నిరోధిస్తాం. ఇందుకోసం ఒక ఏజెన్సీని ఏర్పాటు చేస్తున్నాం. మూడు ప్రాంతాల్లో అవసరంలేని స్పీడు బ్రేకర్లను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా శ్మశానవాటిక సమస్యను ప్రస్తావించారు. నల్లవంతెన వద్దనున్న ఈ శ్మశాన వాటికకు జనరల్ ఫండ్ నుంచి నిధులు విడుదల చేసి అతి త్వరలో ప్రారంభిస్తాం. ఇప్పటికే ఇక్కడ తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి ప్రోసెస్ చేసేందుకు రూ.కోటి ఖర్చులో ప్లాంటు ఏర్పాటు చేశాం. భవిష్యత్తులో ఇక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకుని శ్మశాన వాటికను ప్రారంభిస్తాం. ప్రతీ సోమవారం మున్సిపాలిటీలో ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి 8 నుంచి 9 గంటల వరకు అందుబాటులో ఉంటాను. మీరు నాకు ఫోన్ చేసినా స్పందిస్తా. సెల్ నంబరు 9849905805 తెలియచేయాలి. ఇతర అధికారులు కూడా అందుబాటులో ఉంటారు. సమస్యల పరిష్కార వేదికలో పాల్గొనేందుకు అవకాశం ఇచ్చిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు' అని అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఎక్కడో..



చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలంటే ఎక్కడో దూరాన జనుపల్లి గ్రామానికి పంపించాలి. అంత దూరం పిల్లలను పంపించలేని పరిస్థితి. అంగన్‌వాడీ సిబ్బంది తీసుకువెళ్లలేని పరిస్థితి. 3వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నా కూడా ఎన్నో వ్యయ ప్రయాసలకు గురి కావాల్సి వస్తుంది.

దున్నాల వరలక్ష్మి, బంగారక్క చెరువువీధి,

భర్తను కోల్పోయా..



రోడ్డుపై వెళుతున్న నా భర్తను ఆబోతు వెనుక నుంచి వచ్చి రోడ్డుపై ఎత్తిపడేసింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబానికి ఆయనే అండ. పిల్లలు కూడా లేరు. ఆవులు, ఎద్దులను విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఏ ఆధారం లేకుండా ఒంటరిగా బతుకుతున్నా. పెన్షన్ సదుపాయం కల్పించండి.

ఆర్.కృష్ణవేణి, దున్నాలవారివీధి

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



కల్వకొలను వీధితో పాటు సమీపంలోని పలు వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. మురుగునీరు ముందుకు పారే దారి లేక ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దానికితోడు ఒక్కోసారి కుళాయిల నుంచి మురికినీరు సరఫరా అవుతోంది. డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ఆధునికీకరించాలి.

పిండి సత్యవతి, కల్వకొలనువీధి

ట్రాన్స్‌ఫార్మర్ సరిగా లేదు..



ట్రాన్స్‌ఫార్మర్ లోడు సరిపోకపోవడంతో కొన్ని ఇళ్లకు విద్యుత్ సరఫరా ఉంటుంటే మరికొన్ని ఇళ్లకు విద్యుత్ కోతలు తప్పడం లేదు. అందరికీ విద్యుత్ సరఫరా అయ్యే విధంగా ట్రాన్స్‌ఫార్మర్ లోడు పెంచాలి. గత టీడీపీ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శంకుస్థాపన చేశారు. ఈసారైనా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

పప్పుల శ్రీరామచంద్రమూర్తి, బ్రహ్మానందంవీధి

శ్మశాన వాటిక అభివృద్ధి చేయాలి



శ్మశానవాటిక ప్రారంభమైందని చెబుతున్నారు గానీ ఇంతవరకు ప్రారంభం కాలేదు. మార్కెట్ వీధిలోకి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి. శ్మశాన వాటికలో కనీసం కూర్చొనే సదుపాయం కూడా లేదు. శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి. వార్డులో విద్యుత్ లోఓల్టేజీ, హైఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చి కొత్తది ఏర్పాటు చేయాలి.

అన్యం స్వామి, కనకదుర్గమ్మగుడివీధి

'అంగన్‌వాడీ' అభివృద్ధి చేయాలి



మున్సిపల్ పాఠశాల ఏనాడో మూతబడింది. ప్రస్తుతం బూత్ బంగ్లాగా మారిపోయింది. వార్డు చిన్నారులకు ఉపయుక్తంగా ఉండేలా మూతబడ్డ పాఠశాలను అంగన్‌వాడీ కేంద్రంగా మార్పు చేసి అభివృద్ధి చేయాలి. చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో రోడ్డు ఎత్తు పల్లాలుగా ఉండడంతో ముంపు నీరు రోడ్డుపై నిలిచిపోతోంది.

తోట గణేష్, కల్వకొలను వీధి



కల్వకొలను తాతాజీ



యేడిద శ్రీను కౌన్సిలర్

కోనసీమలో కొబ్బరి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు

పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అయినవిల్లి/అంబాజీపేట, జనవరి28(ఆంధ్రజ్యోతి): కొబ్బరి అపారంగా ఉన్న కోనసీమ ప్రాంతంలో కొబ్బరి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ సూచించారు. అయినవిల్లి మండలం నేదునూరులో కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొబ్బరి ఉత్పత్తి, క్వాయర్ పరిశ్రమలు, తదితర వాటిపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేదునూరులో నెలకొల్పిన పరిశ్రమలో ఐదు కేజీల క్వాయర్ బ్రిక్స్ తయారీ, ఫైబర్ సేకరణ, వర్మీకంపోస్టు తయారీ, హైటెక్ నర్సరీ యూనిట్లను ఆయన పరిశీలించారు. కొబ్బరి కాయ వలుపు దగ్గర నుంచి డొక్కల నుంచి పీచు పొట్టు తయారీ విధివిధానాలపై కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు, సీఈవో అడ్డాల గోపాలకృష్ణ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జైక పరిశ్రమ నుంచి రావాల్సిన నిధులను మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ యూనిట్లు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు సమష్టిగా మరింత పురోగమించే విధంగా ఉన్నతస్థాయికి తీసుకుని వెళ్లాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా పరిశ్రమల కేంద్రంలో అమలు చేస్తున్న స్ఫూర్తి పథకం ద్వారా సుమారు రూ.5 కోట్ల అంచనా వ్యయంతో కొబ్బరి ముడిసరుకుతో తయారవుతున్న ఉత్పత్తుల పరిశ్రమ నెలకొల్పబడిందని జిల్లా ఉద్యానవన అధికారి బీవీ రమణ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ పెట్టుబడి వ్యయంలో 90 శాతం రాయితీని జిల్లా పరిశ్రమల కేంద్రం అందించిందని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో కొబ్బరి పొట్టుతో తయారు చేసిన ఇటుకలను మొక్కల పెంపకానికి గాను మట్టికి బదులుగా వినియోగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు, ఆదినారాయణ, ముత్యాల జమీలు, పరిశ్రమల కేంద్ర ప్రతినిధి మాధవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నేదునూరులో క్వాయర్ ఉత్పత్తులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

కల్యాణోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

అంతర్వేది కల్యాణోత్సవాల నిర్వహణలో అంతా భాగస్వాములై విజయవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ నిషాంతి

అంతర్వేది, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలతో కలిసి మంగళవారం కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు క్యూలైన్, ఉత్తరభాగంలో సిద్ధమవుతున్న కోనేరు, రథం, కల్యాణ మండపం, పార్కింగ్ తదితర వాటిని తనిఖీ చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే స్వామివారి కల్యాణోత్సవాల్లో అధికారులందరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, వైద్యం, విద్యుత్, రహదారులు, క్యూలైన్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం కల్యాణ మండపంలో భక్తుల రద్దీ ఎక్కువ కాకుండా చూడాలని అందరూ కల్యాణం తిలకించేలా ఎల్ఈడీ స్క్రీన్లు, స్నానఘట్టాల వద్ద వసతి గదులతో పాటు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు యంత్రాంగం దృష్టి సారించి ఆలయంలో తొక్కిసలాట జరగకుండా క్యూలైన్‌లో స్వామి దర్శనం సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు, కమాండ్ కంట్రోల్ రూమ్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు కె.మాధవి, డి.అఖిల, పి.శ్రీకర్, డీఆర్వో రాజకుమారి, ఏసీ సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, సర్వేయర్, డిప్యూటీ తహశీల్దార్, ఎంపీటీసీ బైరా నాగరాజు, ముప్పర్తి నాని, వీరా మల్లిబాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను జేసీ నిషాంతికి వివరిస్తున్న ఏసీ సత్యనారాయణ

పోలీస్ శాఖ సమీక్ష

ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా కొత్తపేట డీఎస్పీ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లలో ముఖ్య భూమిక పోషిస్తున్న పోలీసు యంత్రాంగం పనితీరుపై ప్రతీఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు అన్నారు. ప్రధానంగా ఆలయం, కల్యాణ మండపం వద్ద తొక్కిసలాట జరగకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. పలువురు సీఐలతో కలిసి కల్యాణ మండపం, క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలు రథం రూటు, వన్‌వే రూట్, భక్తులు వేచి ఉండే బస్టాండు, బీచ్ రోడ్డు, స్నాన ఘట్టాలను పరిశీలించారు. పోలీసు కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాల పనితీరు, రూట్ మ్యాప్ తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, భీమరాజు, నరేష్‌కుమార్, విద్యాసాగర్, ఎస్ఐలు కె.దుర్గాశ్రీనివాస్, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు

నిరంతరం తల్లిదండ్రులను గౌరవించాలి

- ప్రస్తుతం బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చింది
- ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ తేజ

దివాన్‌చెరువు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన తల్లిదండ్రులను పిల్లలు నిరంతరం గౌరవించాలని ప్రముఖ సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ విద్యార్థులకు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో అభినందన కార్యక్రమం మంగళవారం జరిగింది. శ్రీప్రకాష్ డైరెక్టర్ సీహెచ్.విజయప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అశోక్ తేజ మాట్లాడుతూ తల్లి నవ మాసాలు మోసి జన్మనిస్తే తండ్రి తన గుండెలపై మోస్తూ పిల్లను ప్రయోజకులను చేస్తారన్నారు. అందుకే పిల్లలు తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ముఖ్యంగా కుటుంబంలో తాతలు వంటి పెద్దవారు చెప్పే మాటలు వినాలని అన్నారు. మొబైల్స్ వాడకం తగ్గించాలని, లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. ఈ అభినందనలో మీకు కొడుతున్న చప్పట్లు మీ విజయాలకు మెట్లు కావాలన్నారు. తాను గత 30 సంవత్సరాలుగా 2వేల సినిమాల్లో మూడువేల పాటలు రాశానని తెలిపారు. తాను సినిమాల్లోకి రాక ముందు దాదాపు 2వేల పాటలు సామాజిక, ప్రజల పాటలు రాశానన్నారు. ప్రస్తుతం బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చిందన్నారు.

విజయప్రకాష్ మాట్లాడుతూ అశోక్‌తేజ చెప్పిన ప్రతీ మాట అక్షర సత్యమని, ప్రతీఒక్కరూ దానిని పాటించాలని సూచించారు. విద్య, క్విజ్, ఆటపోటీలు, పోటీ పరీక్షలు, హాజరు తదితర అంశాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అశోక్ తేజ బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, మేనేజర్ ఏఏస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ విమల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నేడు అశోక్ తేజకు వేటూరి సాహితీ పురస్కారం ప్రదానం

తుని రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వేటూరి పురస్కార ప్రదాన వేడుకను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లా తునిలోని చిట్టూరి మెట్రో ప్రాంగణంలో బుధవారం వేటూరి సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు అందజేయనున్నారు. సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.


ఆహాకాశం

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయం వద్ద ఆకాశం మంగళవారం సాయంత్రం అరుణవర్ణం దాల్చింది. ఈ దృశ్యాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు -గొల్లప్రోలు రూరల్

ఆకట్టుకున్న పురూలియా చౌ

జేఎన్టీయూకేలో సంప్రదాయ జానపద నృత్యప్రదర్శన నిర్వహణ

జేఎన్టీయూకే, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో జేఎన్టీయూకేలోని అలూమ్నీ ఆడిటోరియంలో సంక్రాంతి గానసభల పదిరోజుల కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పదో రోజు పశ్చిమబెంగాల్ కళాకారులు నిర్వహించిన పురూలియా చౌ సంప్రదాయ జానపద నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పురూలియా చౌ అనేది భారతదేశంలోని పశ్చిమబెంగాల్‌కు చెందిన సెమీ క్లాసికల్ జానపద నృత్యం. పరమశివుడిని పూజించడానికి అనాదిగా వస్తున్న పూజావిధానాలు, శాస్త్రాలు మంత్రాల నుంచి వచ్చింది. చౌ అనే పదం ఛాయ అనే సంస్కృత పదం నుంచి వచ్చింది. ఈ నృత్యంలో అనేక విన్యాసాలు, యుద్ధానికి సంబంధించిన కదలికలతో పురాణాలకు సంబంధించినవే తీసుకుని చేస్తున్నారు. కళాకారులు అనేక రంగులతో కూడిన దుస్తులు, మాస్కులు వేషాలకు తగ్గట్టుగా ధరిస్తారు. ఈ నృత్యాన్ని బహిరంగ ప్రదేశాల్లో వేదికల మీద రాత్రంతా ప్రదర్శిస్తారు. 2010లో యునెస్కో పురూలియా చౌని వారి జాబితాలో చేర్చుకున్నారు. కళాకారులు నిర్వహించిన మహిషాసుర మర్ధిని, అభి మన్యువధ, జానపద నృత్యాలు అలరించాయి. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ రవీంద్ర నాథ్, కుమార్, విశాల్, గణేష్, ప్రభాస్ పాల్గొన్నారు.

మహిషాసుర మర్ధిని సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు


గడియారం సిద్ధం.. రండి చూసేద్దాం



సామర్లకోటలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన గడియారపు స్తంభం

సామర్లకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గడియార స్తంభం సెంటర్ అంటూ పలు ప్రధాన పట్టణాల్లో మారుమోగే కూడలి ప్రాంతం పేరు. అదే పేరిట సామర్లకోట స్టేషన్ సెంటర్ రింగ్ సెంటర్ వద్ద పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప భారీ గడియారపు స్తంభాన్ని నిర్మించాలని గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేసిన కృషి మూడవ దఫా గెలుపొంది నేటికి నిర్మాణపనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ఎట్టకేలకు సదరు నూతన నిర్మాణ సెంటర్‌పై భారీ గడియారాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. మరో 2 రోజుల్లో లాంఛనంగా ప్రారంభించేందుకు ఎమ్మెల్యే రాజప్ప సన్నాహాలు చేస్తున్నారు.

నాడు ఒరిగి... నేడు మెరిసి!


చింతూరు మండలం సింగన్నగూడెంలో 2 నెలల క్రితం అంగన్వాడీ భవనం దుస్థితి



నేడు రంగులతో మెరిసిపోతున్న అంగన్వాడీ భవనం

చింతూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతూరు మండలం సింగన్న గూడెంలో 1998లో అంగన్వాడీ కేంద్రానికి భవనం నిర్మించారు. కాలక్రమంలో అది శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్‌కు కర్రలతో సపోర్టు ఇచ్చి నిర్వహించాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ భవనానికి తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆదేశించి రూ.3లక్షలు మంజూరు చేశారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ పర్య వేక్షణలో 2 నెలల్లోపే పూర్తిస్థాయిలో ఆధుని కీకరించారు. మంగళవారం దానిని ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పునః ప్రారంభించారు. ఎల్ఈడీ టీవీ, ఇంటర్‌నెట్, ఇతరత్రా సాంకేతక హంగులు సమకూర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగార్జున, తహశీల్దారు చిరంజీవి, ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరి, ఐటీడీఏ ఈఈ మురళీ, ఏఈ తరుణ్, టీడీపీ మండలాధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి, నాయకులు సయ్యద్ ఆసిఫ్, మధు సూదనరావు, శంకర్, శీలం తమ్మయ్య, అంగన్వాడీ టీచరు లక్ష్మి పాల్గొన్నారు.

అన్నవరంలో భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు

- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచన
- మంత్రిని కలిసిన ఆలయ ఈవో సుబ్బారావు


మంత్రికి సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి సత్యదేవుడి సన్నిధికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాల కల్పనకు కృషిచేయాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. మంగళవారం అన్నవరం ఈవో సుబ్బారావు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయంలో చేపడుతున్న అభి వృద్ధి పనులను మంత్రికి వివరించారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ కే.రామచంద్రమోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. దేవస్థానం వేదపండితులు మంత్రి, కమిషనర్‌కు వేదాశీర్వచనాలు అందించారు. వ్రత పురోహిత సంఘ నాయకులు నాగాభట్ల రవిశర్మ, కర్రి నాని, మహేంద్రవాడ జగదీష్, సవితాల వీరబాబు, నాగాభట్ల శంకర్,మణికంఠ ఉన్నారు.





షీల్డు, నగదు చెక్కులు అందుకుంటున్న విజేత జట్టు సభ్యులు

రాష్ట్ర స్థాయి పురోహిత క్రికెట్ విజేత కాకినాడ రుద్రాస్

- కొవ్వూరు గాయత్రీ లెవెన్స్ రన్నర్

అమలాపురం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఫైనల్స్‌లో కాకినాడ రుద్రాస్-కొవ్వూరు గాయత్రీ లెవెన్స్ జట్లు తలపడగా.. కాకినాడ రుద్రాస్ విన్నర్‌గా, కొవ్వూరు గాయత్రీ లెవెన్స్ రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా బహుమతుల ప్రదానోత్సవ సభలో రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు కె.బుచ్చిరామ్ ప్రసాద్, ఏవీ రమణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఈమని సూర్యనారాయణశర్మ, బ్రాహ్మణ సాధికార రాష్ట్ర అధికార ప్రతినిధి యామిజాల నరసింహమూర్తి ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు షీల్డులు, నగదు ప్రోత్సాహక చెక్కులు అందించారు. రాష్ట్ర పురోహితశాఖ గౌరవాధ్యక్షుడు పొదిలి నారాయణమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ దుర్గాబాబు, పురోహిత సమాఖ్య రాష్ట్రప్రధాన కార్యదర్శి రాణి శ్రీనివాస్, కోనసీమ బ్రాహ్మణ సాధికార కన్వీనర్ సత్తిరాజు స్వామి, బోళ్ల వెంకటరమణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, చెల్లుబోయిన శ్రీనివాస్, ఆకొండి పవన్ పాల్గొన్నారు.

కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలో జాలర్లకు అవగాహన

కాకినాడ క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ కోస్ట్ గార్డ్ 49 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ స్టేషన్ ఆధ్వర్యంలో కోస్ట్ గార్డ్ అధికారులు స్థానిక బీచ్ రోడ్డులోని కుంభాభిషేకం గుడి వద్ద మంగళవారం సాయంత్రం సముద్రంలో వేట సాగించే జాలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. వేట సాగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించవల్సిన అంశాలు, తీరం హద్దుల పై అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం నుంచి చెన్నైకి ఈస్ట్రన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన 34 మంది సిబ్బంది ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా బయలుదేరి జాలర్లతో మమేకమై వేటాడే సమయంలో వచ్చే కష్ట, నష్టాల గురించి స్పష్టంగా వివరించారు. జాలర్లు వేట చేసే సమయంలో ఎవరైనా అనుమానాస్పదంగా తారసపడితే వెంటనే అలాంటి వారి గురించి తెలియజేయాలని సూచించారు.

మహా కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- రాజమహేంద్రవరం డిపో నుంచి ఫిబ్రవరి 4, 14, 18 తేదీల్లో నడిపేందుకు ఏర్పాట్లు
- ఇప్పటికే టిక్కెట్లన్నీ హాట్ కేకుల్లా విక్రయం
- మరింత డిమాండ్ ఉన్నా బస్సులు సిద్ధం చేయలేని వైనం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసులు నడుపుతున్నట్టు డీఎం షేక్ షబ్నం తెలిపారు. ఇప్పటికే బస్సులను సిద్ధం చేసి టికెట్ల బుకింగ్ కూడా దాదాపుగా పూర్తి చేశారు. ఫిబ్రవరి 4,14,18 తేదీల్లో బస్సు లు బయలుదేరుతాయన్నారు. 4వ తేదీన మూడు, 14వ తేదీన రెండు, 18వ తేదీన రెండు బస్సుల్లో భక్తులు వెళతారని చెప్పారు. ఏడు రోజులు, పదకొండు రోజులుగా కుంభమేళా యాత్ర పూర్తయ్యేలా రెండు రూట్లలో అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే భక్తుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉన్నా .. మరిన్ని బస్సులు నడపాలంటే కష్టమేనని, అందుకు తగిన ఏర్పాట్లు చేసే పరిస్థితి కనిపించడం లేదని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే బస్సులోని ప్రయాణికులకు భోజనం, తదితర సదుపాయాలు కల్పించాలంటే బయట వ్యక్తులు అవసరం కానుంది. అందువల్ల సర్వీసులు నడపలేకపోతున్నట్టు తెలిసింది. ఈ యాత్రకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారంతో కలిపి ఒక్కొక్కరికి రూ. 10,000 టికెట్ ధరగా నిర్ణయించారు.

- ఆర్టీసీ వర్గాల్లో ఆనందం

టిక్కెట్లన్నీ ఇప్పటికే హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ఆర్టీసీ దీనిపై పెద్దగా ప్రచారం చేయకపోయినా... బుక్ కావడంతో ఆర్టీసీ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 4, 18వ తేదీన కుంభమేళా యాత్రకు వెళ్లే మొత్తం ఐదు బస్సుల టికెట్లు ఇప్పటికే బుకింగ్ పూర్తయిందని, 14వ తేదీన బయలుదేరే రెండు బస్సుల్లో ఒక బస్సుకు టికెట్ బుకింగ్ క్లోజ్ కాగా, రెండో బస్సుకు సైతం డిమాండ్ ఎక్కువగా ఉందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

అయినవిల్లి విఘ్నేశ్వరుడి హుండీ లెక్కింపు

- 67 రోజులకు రూ. 34.67 లక్షల ఆదాయం

ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది


అయినవిల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి హుండీలను మంగళవారం లెక్కించారు. పర్యవేక్షణాధికారి జంగా రామలింగేశ్వరరావు వ్యవహరించారు. మొత్తం 67 రోజులకు గాను ఆలయ ప్రధాన హుండీల నుంచి నగదు రూ.33,43,400, అన్నప్రసాదం హుండీ ద్వారా రూ.1,24,100, వెరసి మొత్తం రూ.34 లక్షల 67,500 ఆదాయం వచ్చింది. అలాగే 409 గ్రాముల వెండి, 12 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

- సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వేణుగోపాల్



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న విస్తరణ శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన పెంపొందించేందుకు వివిధ శాఖలలోని నిపుణులతో రెండురోజుల పాటు పంచాయతీ కార్యదర్శులకు అందిస్తున్న శిక్షణ తరగతులను క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ జే.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని మండలాలకు చెందిన రెండవ బ్యాచ్ పంచాయతీ కార్యదర్శులకు కాకినాడ జిల్లా సామర్లకోట ఈటీసీ ఆవరణలో అందిస్తున్న ఈ శిక్షణ తరగతులను మంగళవారం ప్రిన్సిపాల్ ప్రారంభించారు. పీసా చట్టంపై పంచాయతీ కార్యదర్శులకు వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ వివరించారు. ఐదు జిల్లాలకు చెందిన ఆయా పంచాయతీల కార్య దర్శులు సుమారు 67 మంది హాజరయ్యారు. జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి, రమణ, జాయింట్ డైరెక్టర్ రామ నాథం, ఫ్యాకల్టీలు శ్రీనివాసరావు, ఎం.చక్రపాణి రావు, నిహారిక, జగదీష్, వి.ప్రసాద్, వి.ఆంజనేయులు, పద్మజ, మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 28(ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్లకు సంబంధించి పునఃపరిశీలన రెండో రోజైన మంగళవారమూ కొనసాగింది. కాకినాడ జీజీహెచ్, తుని ఏరియా ఆసుపత్రుల్లో జరిగిన ఈ ప్రక్రియకు 198 మంది హాజరు కావాల్సి ఉండగా, 193 మంది మాత్రమే వచ్చారు . సోమ, మంగళవారాల్లో మొత్తం 378 సర్టిఫికెట్లను పరిశీలించారు.

నలుగురు మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్

● పేకాట క్లబ్‌లకు అడ్డగోలుగా అనుమతులు ● ఇప్పటికే కమిషనర్‌పై వేటు
● విచారణ అనంతరం ఉద్యోగులపై వేటు ● కమిషనర్ ఇచ్చిన వాంగ్మూలంతోనే వేటు..!

యానాం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో మున్సిపల్ శాఖ కు సంబంధించి నలుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు పుదుచ్చేరి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ జి.సౌందర్య రాజన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను యానాం మున్సిపల్ కమిషనర్, పరిపాలనాధికారికి పంపారు. యానాంలో రిక్రియేషన్ పేరుతో వచ్చిన పేకాట కేంద్రాలకు అడ్డగోలుగా ట్రేడ్ లైసెన్సుల అనుమతులు ఇవ్వడం అనంతరం ఈ విషయంలో లక్షలాది రూపాయలు చేతులు మారడం వంటి అంశాలపై విచారణ నిర్వహించిన అనంతరం ఉద్యోగులపై వేటువేశారు. గతంలో ఈ అనుమతులపై పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి మున్సిపల్ కమిషనర్ ఆరుల్ ప్రకాశంను ప్రభుత్వం గత సంవత్సరం జనవరి 21న విధుల నుంచి సస్పెండ్ చేసింది. ఈనేపథ్యంలో పుదుచ్చేరి నుంచి వచ్చిన ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో జరిగిన విచారణలో అడ్డగోలు అనుమతులను గుర్తించడంతోపాటు ఇప్పటికే సస్పెండ్‌కు గురైనా కమిషనర్ వాగ్మూలంతో వీరిపై వేటు వేసినట్లు సమాచారం. వీరిలో బిల్ కలెక్టర్లు ఎం.అప్పారావు, పి.దుర్గారావు, కె.సత్యనారాయణ, పి.ఉషా రాణిలు ఉన్నారు. అదేవిధంగా రాయల్ రిక్రియేషన్ క్లబ్‌కు సంబంధించి అనుమతుల జారీ విషయంలో మరో ముగ్గురు ఉద్యోగుల(ఇద్దరు మహిళ, ఒక పురుషుడు)పై వేటు పడనుంది. ఈ అంశం ప్రస్తుతం యానాంలో తీవ్ర చర్చకు దారి తీసింది. వీటితో పాటు పారిశుధ్య పనుల విషయంలో ఫిర్యాదులు అందడంతో సీబీఐ స్థాయి విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో వీటిపై ఎంతమందిపై వేటు పడనుందనే అంశం ప్రస్తుతం యానాంలో హాట్ టాపిక్‌గా మారింది.

1న సీఎం చంద్రబాబు తూర్పు పర్యటన

» దొమ్మేరులో పేదల గృహ ప్రవేశం
» ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ
» జిల్లా కలెక్టర్ ప్రశాంతి


దొమ్మేరులో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాల్గోసారి సీఎం పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా జిల్లా పర్యటనకు వస్తున్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో పేదల కోసం నిర్మించిన గృహాలను లబ్ధిదారులకు అప్పగించి, గృహప్రవేశాలు సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను కూడా సీఎం స్వయంగా లబ్ధిదా రులకు అందజేస్తారు. అనంతరం అక్కడ హౌసింగ్ లబ్ధిదారులతో సభ నిర్వహిస్తారు. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు, జేసీ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహ కిశోర్ తదతర అధికారులతో సమీక్షించారు. భద్రత దృష్ట్యా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఆర్భా టాలకు దూరంగా, సాదాసీదాగా సీఎం పర్యటన ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిశోర్ తెలిపారు. ముందుగా కలెక్టర్ మా ట్లాడుతూ 1వ తేదీన సీఎం చంద్రబాబు దొమ్మేరులో పేదల గృహ ప్రవేశ కార్యక్రమం, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొంటారన్నారు. అధికార్లంతా సమన్వయంతో వ్యవహరించి సీఎం పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమానికి పూర్తిస్థాయి ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు హెలిప్యాడ్ ఏర్పాటుకు ఆర్అండ్‌బీ అధికారులు, ప్రోటోకాల్ వ్యవహారాలు ఆర్డీవో బాధ్యత వహిస్తారన్నారు. పోలీసులు లా అండ్ ఆర్డర్ చూ స్తారని చెప్పారు. కొవ్వూరు డివిజన్, నియోజకవర్గం, దొమ్మేరు గ్రామ పంచాయతీకి సంబంధించిన యాక్షన్‌ప్లాను సీపీవోకు, శానిటేషన్, మంచినీటి పనులను మున్సిపల్ అధికార్లకు ఇతర పనులను ఆయా శాఖలకు అప్పగించారు. ఎస్పీ డి.నరసింహకిషోర్ మాట్లాడుతూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. సమావేశంలో డీఆర్వో టి.సీతా రామమూర్తి, ఆర్డీవోలు రాణి సుస్మిత, కృష్ణనాయక్, హౌసింగ్ ఇన్‌చార్జికె.భాస్కర్ పాల్గొన్నారు.

అడివి పంది దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన విష్ణుదొర

గోకవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అడవిపంది దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గంగవరం మండలం దోనేపల్లికి చెందిన బి.విష్ణుదొర మంగళవారం పొలం పనుల నిమిత్తం వెళ్లాడు. ఇంతలో అక్కడ ఉన్న అడివి పంది దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో బాధితుడు గాయాలతో ఇంటికి చేరుకున్నాడు. అక్కడి నుంచి చికిత్స నిమిత్తం 108 వాహనంలో గోకవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలికపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

» బాధిత కుటుంబ సభ్యులు దేహశుద్ధి
» సెలవుపై వెళ్లిపోయిన ఉపాధ్యాయుడు
» ఆలస్యంగా వెలుగుచూసిన వైనం

కరప, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక కార్యదర్శిగా సామాన్య ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంతోపాటు బాధ్యత కలిగిన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఒక వ్యక్తి సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించాడు. అభం శుభం తెలియని ఐదేళ్ల బాలికను లైంగికంగా వేధించి కన్నవారి ఆగ్రహానికి గురయ్యాడు. బాధిత కుటుంబీకులు దేహశుద్ధి చేయడంతో అవమానభారంతో సెలవుపై వెళ్లిపోయాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కరప మండలం వాకాడ మెయిన్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీఎస్ రామారావు అదే పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఒక బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాదజత బాలిక విషయాన్ని తల్లికి చెప్పడంతో కామాంధుడి భాగోతం బయటపడింది. ఈలోగా సదరు ఉపాధ్యాయుడు గ్రామ పెద్దలను ఆశ్రయించడంతో ఈనెల 3న పాఠశాలలో ఇరువర్గాలను పిలిచి రాజీ ప్రయత్నం చేశారు. ఈక్రమంలో బాలిక తల్లి కామాంధుడి ముఖంపై ఉమ్మివేసి నానా దుర్భాషలాడగా, బంధువులు దేహశుద్ధి చేశారు. జరిగిన విషయం బాహ్య ప్రపంచానికి తెలిస్తే తమ పరువుపోతుందని భావించిన బాధితులు ఫిర్యాదు చేయడానికి వెనకడుగు వేసినట్టు తెలుస్తోంది. పాఠశాల నుంచి సదరు ఉపాధ్యాయుడిని పంపించివేయాలని బాలిక కుటుంబ సభ్యులు పట్టుబట్టారు. దీంతో అతను సెలవుపై వెళ్లిపోయాడు. దీనిపై వివరణ కోరేందుకు మండల విద్యాశాఖాధికారిణికి ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు. జనవిజ్ఞాన వేదిక జనరల్ సెక్రటరీగా లెక్చర్లు ఇచ్చే రామారావు తనవద్ద చదువుకునే బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడడంపట్లవిమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి ఉపాధ్యాయులపట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖతీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

» చేయి, మెడపై గాయాలు
» ఆస్తి తగాదాలే కారణం

రంగంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొత్త వీరంపాలెంలో ఓ వ్యక్తి కత్తితో హల్‌చల్ చేశాడు. దీంతో సదరు వ్యక్తి చెయ్యి, మెడపై తీవ్ర గాయాలయ్యాయి, రంగంపేట ఎస్‌ఐ తోట కృష్ణసాయి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త వీరంపాలెంకి చెందిన మత్స సతీష్‌కి అదే గ్రామానికి చెందిన మత్స శ్రీనివాస్‌కి కొంత కాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం సతీష్ తన ఇంటివద్ద భార్యతో ఉండగా శ్రీని వాస్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన సతీష్ చెయ్యి అడ్డుపెట్టడంతో బొటనవేలు, మెడపై గాయాలయ్యాయి, సతీష్ భార్య వెంటనే బంధువుల సహాయంతో అనపర్తి గంగిరెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తనభర్తను చంపాలనే ఉద్దేశ ంతో కత్తితో దాడికి పాల్పడిన శ్రీని వాస్, ప్రోత్సహించిన అతని తండ్రి సుబ్బన్నను కఠినంగా శిక్షించాలని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మరో యువకుడి మృతి

ముమ్మిడివరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారి ముమ్మిడివరం బైపాస్ రోడ్డు వై-జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో శనివారంరాత్రి నలుగురు యువకులు గాయపడగా వారిలో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురానికి చెందిన గెద్దాడ మణికంఠ(20) మంగళవారం మృతి చెందాడు. అయినవిల్లి మండలం ఎరకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్(18) ఆదివారం మృతి చెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో ఎరకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్ (18), అనాతవరానికి చెందిన తాడి పల్లంరాజులు ఒక మోటారుసైకిల్‌పై అమలాపురం వైపునుంచి ముమ్మిడివరం వస్తుండగా కాకినాడ నుంచి మలికిపురం వెళుతున్న గెద్దాడ మణికంఠ, నల్లి వంశీ మరో మోటారుసైకిల్‌పై వెళుతుండగా ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ఈప్రమాదం జరిగింది. అయితే వడ్డి సిరాజ్, గెద్దాడ మణికంఠలు చికిత్స పొందుతూ మృతి చెందగా ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులు చికిత్స పొందుతున్నారు. ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చమురు సంస్థలు పర్యావరణానికి విఘాతం కలుగకుండా

జాగ్రత్తలు పాటించాలి: కలెక్టర్


మోడేకుర్రులో ఓఎన్జీసీ సైటును పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): చమురు, సహజవాయువులు వెలికితీత మూలంగా పర్యవరణానికి ఎటువంటి విఘాతం కలుగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామంలో ఓఎన్జీసీ ఆధ్వర్యంలో నెలకొల్పిన న్యూ జనరేషన్ రిగ్గు స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీ అమలులో భాగంగా ఏర్పాటుచేసిన ఆధునాతన రిగ్గు పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయిల్ కంపెనీ ప్రతినిధులు ఈ రిగ్గు పనితీరంతా ఆటోమేటిక్‌గా ఆపరేట్ అవుతుందని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఆధునాతన సాంకేతిక టెక్నాలజీతో పనిచేసే రిగ్గు మూలంగా పర్యావరణానికి ఎటువంటి హానీ కలుగకుండా చూడాల్సిన బాధ్యత ఓఎన్జీసీ అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఎటువంటి సహకారం కావాలన్న తనను సంప్రదించవచ్చునన్నారు. ఓఎన్జీసీ అధికారులు స్థానికంగా ఈ ప్రాంత అభివృద్ధికి సహాయపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టేట్ సపోర్టు మేనేజర్ జి.శ్రీనివాస్, దోలా కిషోర్, ఆర్పీసింగ్, ఓఎన్జీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలోకి దూకి యువకుడి గల్లంతు



అల్లవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు, పాశర్లపూడి వైనతేయ బ్రిడ్జిపై యాక్సిస్ స్కూటీని వదిలిపెట్టి వైనతేయ గోదావరి నదిలో దూకి యువకుడు గల్లంతయ్యాడు. మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన జవ్వాది కృపాకిరణ్ (25) గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. చెన్నైలో విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కృపాకిరణ్ శనివారం చెన్నై నుంచి ఇంటికి వచ్చాడని కుటుంబ సభ్యులు తెలిపారు. చెన్నైలో ఉద్యోగం చేసే సంస్థలో ఎద్దైనా గొడవపడి ఉంటాడని, వచ్చిన నాటి నుంచి మనోవేదనతో ఎవరితో మాట్లాడకుండా ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.నాలుగు నెలల క్రితమే చెన్నైలో ఉద్యోగం వచ్చిందని, ఇటీవల సంక్రాంతికి వచ్చి వెళ్లి మళ్లీ వచ్చాడని తల్లి సీత అన్నారు. కృపాకిరణ్ తన స్కూటీని వదిలి బ్రిడ్జిపై నుంచి దూకేయడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో అల్లవరం పోలీసులకు సమాచారం అందించారు. తల్లి సీతకు కృపాకిరణ్ ఒక్కడే కుమారుడని ఆమె భర్త నాగేశ్వరరావు గతంలో చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అల్లవరం ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలికి చేరుకునియాక్సిస్ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. గల్లంతైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జవ్వాది కృపాకిరణ్ ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేస్తున్నామని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.


పంట కాలువలో బోల్తా పడిన స్కూల్ బస్

పంట కాలువలో స్కూల్ బస్సు బోల్తా

● స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడిన విద్యార్థులు

పెద్దాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలో స్కూల్ బస్సు అదుపు తప్పి బోల్తాపడిన సంఘటన పెద్దాపురం మండలం వడ్లమూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సామర్లకోట పట్టణానికి చెందిన శ్రీ వివేకానందా స్కూల్ బస్సు దివిలి, వడ్లమూరు గ్రామాలకు చెందిన విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్లే క్రమంలో వడ్లమూరు గ్రామానికి చేరుకునేసరికి రోడ్డు ఇరుకుగా ఉండడంతో బస్సు అదుపుతప్పి సమీపంలో ఉన్న పంట కాలువలోకి బోల్తా కొట్టింది. ఆ సమయంలో బస్సులో ఉన్న ఏడుగురు విద్యార్థులకు స్వల్పంగా గాయాలు కావడంతో వారు బస్సులో నుంచి విద్యార్థులు హాహాకారాలు చేశారు. సమీపంలో ఉన్న రైతులు వెంటనే అక్కడకు చేరుకుని వారిని రక్షించారు. రోజూ బస్సును నడిపే డ్రైవర్ సెలవు పెట్టడంతో తాత్కాలికంగా మరో డ్రైవర్‌ను పాఠశాల యాజమాన్యం ఏర్పా టుచేయడంతో ఈ ప్రమాదం సంభవించి నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పెద్దాపురం ఎస్‌ఐ మౌనిక సంఘటనా స్థలా నికి చేరకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడ్డ విద్యార్థులను ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఇళ్లకు పంపించే ఏర్పాటు చేశారు. ఈ విషయంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారికి అడ్డంగా గేటు ఏర్పాటుపై వివాదం

● అడ్డుకున్న మహిళలపై పెట్రోల్ పోసిన వైనం
● కరప పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన


కరప పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న గొడ్డటిపాలెం గ్రామస్తులు

కరప, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపమండలం గొడ్డటిపాలెం గ్రామంలో ఒక వ్యక్తి నలుగురు నడిచే దారికడ్డంగా గేటు ఏర్పాటుచేయడంపై వివాదం నెలకొంది. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గొడ్డటిపాలెం గ్రామంలోని మాస్టారు గారి వీధికి చేర్చి నక్కా సత్యనారాయణ, అతని కుమారుడు బ్రహ్మాజీలు ఈనెల 23న గోడ కట్టి గేటు పెట్టే ప్రయత్నం చేశారు. దీనిపై అభ్యంతరం తెలిపిన పలు కుటుంబాల వారు అదే రోజు అధికారులకు ఫిర్యాదుచేశారు. అయినా పట్టించుకోకుండా రెండురోజుల క్రితం గేటు ఏర్పాటుచేశారు. అక్రమంగా గేటు ఏర్పాటుచేయడాన్ని తట్టుకోలేని వీధిలోని మిగిలిన కుటుంబాల వారు మంగళవారం ఉదయం ఎక్స్‌కవేటర్ సహాయంతో గేటును తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో కోపోద్రిక్తుడైన నక్కా బ్రహ్మాజీ పెట్రోల్ తీసుకువచ్చి అక్కడ మోహరించిన మహిళలపైన, ఎక్స్‌కవేటర్‌పైన చల్లాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. బాధిత మహిళలు, కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం రాత్రి కరప పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. అక్రమంగా గేటును ఏర్పాటుచేయడమేగాక తమపై దాడిచేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం ఫిర్యాదుచేసి అక్కడి నుంచి వెనుదిరిగారు. అయితే దీనిపై కరప పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు స్పందించకపోవడం గమనార్హం.

కుమారస్వామిని హత్యచేసిన

నిందితులను శిక్షించాలి

» ఆందోళన చేసిన కుటుంబ సభ్యులు


రాజోలులో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

రాజోలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తాటిపాకలో ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ప్రాజెక్టు చెరువులో అదే గ్రామానికి చెందిన గుమ్మడి కుమారస్వామి మృతదేహం తేలియాడిన సంఘటన మంగళవారం పాఠకులకు విదితమే. కుమారస్వామి చెరువులో పడి మృతిచెందలేదని, తలమీద, పీక మీద దెబ్బలు ఉన్నాయని కుమారస్వామిని కొట్టి చంపి చెరువులో పడవేశారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజోలు సామాజిక ఆసుపత్రి వద్ద కుమారస్వామి కుటుంబ సభ్యులు మంగళవారం ఆందోళన చేశారు. కుమారస్వామిని హత్యచేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. రాజోలు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 26న కుమారస్వామి కనిపించడంలేదని రాజోలు పోలీసుస్టేషన్‌లో కుమారస్వామి మామయ్య సారిక వెంకటశ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈనెల 28న మంచినీటి చెరువులో శవమై తేలాడు. కుమారస్వామిని కొట్టి హత్య చేశారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారని తెలిపారు. కుమారస్వామి కుటుంబ సభ్యులు నలుగురు అనుమానిత వ్యక్తుల పేర్లను పోలీసులకు తెలిపాడు. ఆ నలుగురిలో ఇద్దరిని పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి విచారిస్తున్నామని, మిగతా ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. దీంతో కుమారస్వామి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

జనన ధ్రువీకరణ పత్రం కోసం లంచం డిమాండ్ చేసిన

వీఆర్వో సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గండేపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జనన ధ్రువీకరణ పత్రం కోసం లంచం డిమాండ్ చేస్తున్న వీఆర్వోపై సోమవారం ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పం దించారు. ఈమేరకు వీఆర్వో సరుగేల సూర్యారావును సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడజిల్లా గండేపల్లి మండలం లోని సూరంపాలెం గ్రామానికి చెందిన అడ్డల అనంతలక్ష్మి వారి పిల్లలకు సంబంధించి జనన ధృవీకరణ పత్రాల విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

ముగ్గురు పాత నేరస్తుల అరెస్టు

● 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు పాత నేరస్తులను బొమ్మూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దొంగల వివరాలను పోలీసులు వెల్లడించారు. రాజమహేంద్రవరం లాలాచెరువు హౌ సింగ్ బోర్డు కాలనీకి చెందిన తోట శివ, యానాం జార్జ్ పేట మహాలక్ష్మికాలనీకి చెందిన షేక్‌బషీర్, రాజమహేంద్రవరం నారాయణపురం గెయిల్ కార్యాలయం వెనుక ప్రాంతం వాంబేకాలనీకి చెందిన కాపు అరుణసాయికుమార్‌లను పోలీసులు అరెస్టుచేశారు. ఈనెల 25వ తేదీ రాత్రి 11గంటల సమయంలో చౌడేశ్వరనగర్‌లో మంచలి నరేష్ అనే వ్యక్తి రాజానగరం నుంచి స్కూటీపై ఇంటికి వస్తుండగా మార్గంమధ్యలో రాత్రి ఈ ముగ్గురు దుండగులు అడ్డగించి కత్తితో బెదిరించి స్కూటీ లాక్కుని తన వద్ద ఉన్న రూ.4 వేలు లాక్కుని వెళ్లిపోయారని బాధితుడు బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో తమకు వచ్చిన సమాచారంతో స్థానిక సీఐ తన సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద ముగ్గురు దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.8లక్షలు ఉంటుంది. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

తునిలో ముగిసిన దివ్యాంగుల

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

తుని రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆంధ్రప్రదేశ్ పారా వాలీబాల్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల వాలీబాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. కాకినాడ జిల్లా తుని రాజా కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 150 మంది దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారా వాలీబాల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు శివదత్ మాట్లాడుతూ దివ్యాంగుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి వారిని ఒలింపిక్స్‌కి పంపించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. విజయనగరం టీమ్ విన్నర్‌గా, శ్రీకాకుళం టీమ్ రన్నర్‌గా నిలిచాయి. విజేత జట్లకు విశాఖజిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్‌తో కలిసి అసోసియేషన్ సభ్యులు బహుమతులు, నగదు చెక్కులు అందజేశారు. అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర స్థాయికి 20 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జనసేన పాయకరావుపేట నియోజకవర్గ నాయకుడు శ్రీనివాస్‌కుమార్, కాకినాడ కోలా సోమశేఖర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గాప్రశాంతి, జనసేన అనకాపల్లి జిల్లా సెక్రటరీ రాకెట్ గోవిందరావు, జాయింట్ సెక్రటరీ పురందాసు అప్పలరాజు, రాజేపేట ప్రెసిడెంట్ పిక్కి స్వామి, బోడపాటి సతీష్, ఈవెంట్ ఆర్గనైజర్లు గోవిందు, శ్రీను, మధు, నాగశక్తి పాల్గొన్నారు.



దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ముగ్గురు దొంగల అరెస్ట్

» రూ.13.38 లక్షల విలువైన బంగారు ఆభరణాలు. ఐదు బైక్‌ల స్వాధీనం

భీమవరంటౌన్, జనవరి (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరె స్టు చేసి వారి వద్ద నుంచి 13 లక్షల 38 వేల రూపాయిల బంగారు ఆభణాలు, ఐదు మోటా రు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. కాళ్ల మండలం సీసలిలోని ముగ్గళ్ల నర్సింహారావు ఇంటిలో దొంగతనానికి పాల్పడిన అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంకు చెందిన జొన్నల వెంకటేష్, కాళ్ల మండలం బొండాడపేటకు చెందిన ఆకురాతి జోష్ణదేవితోపాటు భీమవరంలోని అట్టిక గోల్డ్ కంపెనీలో పనిచేస్తున్న పాలకొల్లుకు చెందిన గొర్రెల కృష్ణలను అరెస్టు చేశామన్నారు. నిందితులను ఆకివీడు సీఐ వి.జగదేశ్వరరావు, ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు విచారించగా జొన్నల వెంకటేష్, ఆకురాతి జోష్ణదేవి జిల్లాలోని ఉండి, పెంటపాడు, తణుకు రూరల్, తాడేపల్లిగూడెం రూరల్, ఏలూరు జిల్లాలో నిలక్కవరం, తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల ప్రాంతంలో బంగారు గొలుసులు దొంగతనాలకు పాల్పడ్డామని తెలిపారన్నారు. కాళ్ళ, ఉండ్రాజవరం, ముదినేపల్లి పరిధిలో మోటారు సైకిళ్లను దొంగతనం చేశారన్నారు. జొన్నల వెంకటేశ్ ఆటోలు, బస్సులు కోసం ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని వారికి మోటారు సైకిల్‌పై లిఫ్ట్ ఇచ్చి వారి మెడలోని బంగారు ఆభణాలు దొంగిలించే వాడన్నారు. నిందితులు వెంకటేశ్ బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.70 వేలు. జోష్ణదేవి ఖాతాలో రూ.1.80 లక్షలు సీజ్ చేశామన్నారు. ఈ కేసులో అట్టిక గోల్డ్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సివుందన్నారు. కేసును ఛేదించిన సీఐ జగదీశ్వరరావు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, కానిస్టేబు ళ్లను అభినందించి నగదు రివార్డులను అందిం చారు. సమావేశంలో డీఎస్పీ ఆర్.జయసూర్య, ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, ఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో మంగళవారం నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. బొబ్బర్లంక, గోదావరి మధ్యలో నాటుసారాకు ఉపయోగించే 600 లీటర్ల పులుపు బెల్లపు ఊటను ధ్వంసం చేసిన్నట్లు ఎస్‌ఐ కె.అన్నవరం తెలిపారు.

పొలం పిలుస్తోంది...

అంతర్వేది, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో గొంది, గుడిమూల గ్రామాల్లో వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు ప్రభుత్వ పథకాలు, దాళ్వాసాగుపై పలు సూచనలు, సలహాలు అందించారు.

సాగునీటి పంపిణీ వ్యవస్థ పూర్తిస్థాయిలో అభివృద్ధి

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నామన రాంబాబులను సత్కరిస్తున్న నీటి సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు

పి.గన్నవరం, జనవరి28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో పంట కాలువలను పూర్తిగా విస్మరించారని, రాబోయే కాలంలో శివారు ప్రాంతాలకు సైతం సాగునీరు పూర్తిస్థాయిలో అందేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద నీటి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అభినందన సభకు పి.గన్నవరం డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్‌చైర్మన్ చొల్లంగి సత్తిబాబు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఇప్పటికే పంటకాలువల్లో పూడికతీత, రక్షణ గోడల నిర్మాణానికి సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. నూతనంగా ఏర్పడిన సాగునీటి సంఘాలు పంటకాలువల అభివృద్ధికి అధికారులతో కలిసి సమన్వయంగా పనిచేయాలన్నారు. వేసవిలో రైతులకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. తొలుత ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 8నీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లను టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ నామన రాంబాబుతో కలిసి ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించారు. అదేవిధంగా నీటి సంఘాల సభ్యులు ఎమ్మెల్యే, నామన రాంబాబులను సత్కరించారు. కార్యక్రమంలో డ్రైన్స్ ఈఈ ఎంవీవీ కిషోర్, డీఈలు జె.శ్రీనివాస్, ఆర్.నాగేంద్రకుమార్, నాగార్జునరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీటీసీ పులపర్తి చినవెంకటలక్ష్మి, దాసరి వీర వెంకట సత్యనారాయణ, బొండాడ నాగమణి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మొల్లేటి శ్రీను, తోలేటి సత్తిబాబు, సాధానాల శ్రీవెంకట సత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, సంసాని పెద్దిరాజు, గణపతి వీరరాఘవులు, కె.సత్యనారాయణ, శేరు శ్రీనుబాబు పాల్గొన్నారు.

జగ్గరాజుపేట ఓఎన్జీసీ ప్లాంట్ వద్ద గ్రామస్తుల ధర్నా



ప్లాంట్‌వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ చల్లపల్లి పంచాయతీ జగ్గరాజుపేటలో గ్రామస్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఓఎన్జీసీ ప్లాంట్ గేటు వద్ద ధర్నా శిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి ప్రారంభమైన ఆందోళన రాత్రి వరకు కొనసాగింది. మధ్యాహ్నం అక్కడే వంటవార్పు చేపట్టారు. స్థానికులకు ఉద్యోగాల కల్పనలో ఓఎన్జీసీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాంట్‌లోకి ఉద్యోగులను వెళ్లకుండా అడ్డుకుని ప్లాంట్‌ను దిగ్బంధించారు. గ్రామాభివృద్ధికి చర్యలు చేపట్టాలని, కాలుష్య నివారణకు గ్రీన్‌బెల్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానికులు పట్ల నిర్లక్ష్య ధోరణితో ప్రవర్తిస్తున్న ప్లాంట్ రెసిడెంట్ ఇంజనీర్ రవీంద్రషానవత్‌ను సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. ఒక సమయంలో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయటంతో అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఐ అవినాశ్ అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం ఓఎన్జీసీ అధికారులు రవిశంకర్, రామచంద్రుడు, శ్యామ్, హుస్సేన్ ఆందోళనకారులతో చర్చలు జరిపారు. న్యాయమైన డిమాండ్లు రెండురోజుల్లో పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. మూడు నెలల్లో గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. యువత ఉపాధి కల్పనకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, బీఎస్పీ అమలాపురం ఇన్‌చార్జి పోలమూరి మోహన్‌బాబు పాల్గొన్నారు. తహశీల్దార్ వాసా దివాకర్ పరిస్థితిని పర్యవేక్షించారు. జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ, కె.మానస, నల్లా శ్రీధర్, యేడిద శ్రీను, లింగోలు పండు శిబిరంలో పాల్గొని ఆందోళనకు మద్దతు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో ఆదర్శంగా నిలవాలి

ఎంపీ హరీష్‌మాధుర్



రహదారి భద్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞలో పాల్గొన్న ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం రూరల్, జనవరి 28 ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థులు ఆదర్శంగా నిలవాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో 36వ రహదారి భద్రతా మాసోత్సవాలు-2025ను పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన తర్వాత మాత్రమే విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్సు తీసుకుని వాహనాలు నడపాలని సూచించారు. హెల్మెట్ లేకుండా మోటారు సైకిళ్లు నడపడం ప్రమాదకరమన్నారు. సోషల్ మీడియాపై ఎంత అవగాహన ఉంటుందో రహదారి భద్రతపై కూడా అంతే బాధ్యతతో ఉండాలని సూచించారు. విద్యార్థులకు డ్రైవింగ్ లైసెన్సులు అందించేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయించనున్నట్టు ప్రకటించారు. జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ లైసెన్సు లేకుండా మోటారుసైకిళ్లు నడిపితే తల్లిదండ్రులు శిక్షార్హులు అవుతారన్నారు. కళాశాల చైర్మన్ బోనం కృష్ణసతీష్ మాట్లాడుతూ మన కళాశాల విద్యార్థులు మిగతా కళాశాలల విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, ఎన్‌ఎస్ఎస్ కోఆర్డినేటర్ దుర్గారావు, పీడీ కరాటం రవిసుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పాఠ్యపుస్తకంలో ఏకాదశరుద్రుల ప్రభలతీర్థం చరిత్ర

సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్



పాఠ్యపుస్తకాన్ని చూపిస్తున్న విద్యార్థినులు

అంబాజీపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతిచెందిన జగ్గన్నతోట ఏకాదశరుద్రుల ప్రభల తీర్థం చరిత్ర పదో తరగతి పాఠ్యపుస్తకంలో ముద్రించారు. ప్రభల తీర్థం విశిష్టత, ప్రభల ఉత్సవాన్ని ఎందుకు నిర్వహిస్తారని ఆ పాఠ్యపుస్తకంలో విపులంగా వివరించారు. 2020లో ప్రధాని నరేంద్రమోదీకి గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవయూత్ సభ్యులు జగ్గన్నతోట విశిష్టతపై లేఖరాయడంతో ఆయన స్పందించి ఏకాదశ రుద్రుల ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తు ప్రధాని ప్రతిలేఖను రాశారు. దీంతో అప్పటి నుంచి ఈ ఏకాదశ రుద్రుల ప్రభల మహోత్సవం మరింత ఖ్యాతి చెందింది. 2021లో స్వామాజిక సందేశాన్ని ఇవ్వడం, 2023లో దేశరాజధాని ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో ఏపీ తరుపున ఏకాదశ రుద్రుల ప్రభల శకటాన్ని రూపొందించి ప్రదర్శించారు. ఈఏడాది కేంద్ర పర్యాటక శాఖ ఉత్సవ్ వైబ్ సైట్‌లో చోటు దక్కడంపై ఈజగ్గన్నతోట ప్రభల ఉత్సవానికి మరింత వైభవం ఏర్పడింది. విశ్వవ్యాప్తిచెందిన జగ్గన్నతోట ప్రభల ఉత్సవం చరిత్ర పదో తరగతి పాఠ్యాంశంలో రావడం ఎంతో గర్వకారణమని శివకేశవ యూత్ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



పాఠ్యపుస్తకంలో ముద్రించిన దృశ్యం

అక్కిరాజు చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం



రాజోలులో ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్ ఆధునికీకరణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ముదునూరి లతేంద్రవర్మ చేస్తున్న సేవలు అభినందనీయమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శ్రీముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో చైర్మన్ లతేంద్రవర్మ ఆధునికీకరించిన సాంఘిక సంక్షేమ సమీకృత బాలికల వసతిగృహం గదులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.11లక్షల వ్యయంతో వసతి గృహంలోని గదులు, టాయిలెట్లు, కారిడార్ ఆధునికీకరించడం పట్ల వర్మను ఆయనఅభినందించారు. నెల రోజుల క్రితం హాస్టల్‌లోని ఫ్లోరింగ్, మరుగుదొడ్లు సక్రమంగా లేవని తమ దృష్టికి తీసుకురావడంతో అక్కిరాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ లతేంద్రవర్మ స్పందించి వాటిని ఆధునికీకరిస్తామని అన్నమాట నిలబెట్టుకున్నారన్నారు. అనంతరం లతేంద్రవర్మను ఎమ్మెల్యే దేవ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, మలికిపురం ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, రాజోలు, పొదలాడ నీటి సంఘాల అధ్యక్షులు పినిశెట్టి బుజ్జి, ఉలిశెట్టి లక్ష్మణరావు, గుండాబత్తుల తాతాజీ, సర్పంచ్ రేవు జ్యోతి, కడలి మోహన్, సఖినేటిపల్లి మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఫణికుమార్ పాల్గొన్నారు.

పీఎంఈజీపీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

యానాం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమాన్ని అర్హులైన ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పరిపాలనాధికారి మునిస్వామి అన్నారు. యానాం జిల్లా పరిశ్రమ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సర్వశిక్ష అభియాన్ సమావేశపు హాలులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మునిస్వామి మాట్లాడారు. యానాంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈపథకం ద్వారా పరిశ్రమలు, సేవారంగాల్లో స్వయం ఉపాధి నిమిత్తం బ్యాంకు ద్వారా రాయితీతో కూడిన రుణాలు పొందవచ్చన్నారు. పుదుచ్చేరి నుంచి వచ్చిన అధికారులు, ప్రతినిధులు ఈపథకం విశిష్టతను వివరించారు.

'సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దు'



రవితేజ కళాశాలలో రోడ్డు భద్రతపై మాట్లాడుతున్న సీఐ డి.ప్రశాంత్‌కుమార్

అల్లవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లు మాట్లాడుతూ హెల్మెట్లు లేకుండా ముగ్గురేసి చొప్పున వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. పోలీసు భద్రతా వారోత్సవంలో భాగంగా అల్లవరం రవితేజ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల పట్ల యువతీయువకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్, ప్రిన్సిపాల్ బళ్ల వెంకటరమణ పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ఆలమూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సారా విక్రయిస్తున్న ఆలమూరు మండలం జొన్నాడ, మండపేట మండలం వెలగతోడు గ్రామాలకు చెందిన పడమటి వెంకటస్వామి, రేలంగి అప్పారావులను మంగళవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

'అంబేడ్కర్‌ను అవమానించింది కాంగ్రెస్సే'



గొంది గ్రామంలో సంవిధాన్ గౌరవ అభియాన్ సభలో మాట్లాడుతున్న అయ్యాజీవేమా

అంతర్వేది, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గొంది గ్రామంలో సంవిధాన్ గౌరవ అభియాన్ సభను బీజేపీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమా విచ్చేసి మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అడుగడుగునా కాంగ్రెస్ ప్రభుత్వం అవమాన పరిచిందన్నారు. 1952 ఎన్నికల్లో, 1954 మధ్యంతర ఎన్నికల్లో పోటీ చేసిన అంబేడ్కర్‌పై కాంగ్రెస్ పోటీకి నిలిచి ఆయన్ను ఘోరంగా ఓడించారని వేమా అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో అంబేడ్కర్‌కు భారతరత్న ఇచ్చారని, నరేంద్ర మోదీ ప్రభుత్వం అంబేడ్కర్ పేరున ఐదు ప్రదేశాల్లో పంచ తీర్థాల పేరున వాటిని అభివృద్ధి చేయడంతో పాటుస్మారక భవనాలు ఏర్పాటు చేశారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు 106 సార్లు కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలతో పాటు ప్రభుత్వ ప్రయోజనాల కోసమే చట్ట సవరణలు చేశారన్నారు. బీజేపీ నేతృత్వంలో సుమారు 26సార్లు దేశ ప్రయోజనాల కోసమే చట్ట సవరణలు చేశారన్నారు. ముందుగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, రాష్ట్ర డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెపాంటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, పట్టాపు సూర్యప్రకాశరావు, బోనం నాయుడు, రావూరి బాబ్జి, బొమ్మిడి నరసింహస్వామి, మంతెన సతీష్‌రాజు, వాస్కూరి వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా కలశ శోభాయాత్ర



శోభాయమానంగా శ్రీశ్యామలాదేవి చైతన్యకలశ శోభాయాత్ర

అమలాపురం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అమలాపురం విద్యుత్ నగర్‌లోని ఆదిశేషా నిలయంలో శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షోడసరాత్రి శ్రీశ్యామల నవరాత్రులను పురస్కరించుకుని మంగళవారం శోభాయమానంగా శ్రీశ్యామలాదేవి చైతన్య కలశ శోభాయాత్ర నిర్వహించారు. అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పురవీధుల మీదుగా యజ్ఞశాల ప్రాంగణానికి చేరుకుంది. అనంతరం లఘు సర్వతోభద్ర వేదికపై 33మంది దేవతల ప్రతిష్ఠ నిర్వహించారు. గణపతి పూజతో నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. అఖండ జ్యోతి ప్రజ్వలన, కలశ స్థాపనతో 9రోజుల పాటు ఒక్కొక్క దేవతకు పూజలు నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 12వ తేదీ వరకు అహోరాత్రులు నిర్విరామంగా 16 రోజుల పాటు యజ్ఞ యాగాది క్రతువులు జరుగుతాయని అక్షయపాత్ర వ్యవస్థాపకురాలు పి.నాగకనకదుర్గ తెలిపారు.

రెండు కుటుంబాల మధ్య కొట్లాట... కేసులు నమోదు

అంతర్వేది: జనవరి 28(ఆంధ్రజ్యోతి):పాత గొడవల నేపథ్యంలో రెండు కుటుంబాల వారు కర్రలతో దాడులకు పాల్పడ్డారు. అంతర్వేది పల్లిపాలేనికి చెందిన కొల్లాటి రాంబాబు తన సైకిల్‌ను రోడ్డుగా అడ్డుగా పెట్టాడని, మోటార్ సైకిల్‌ను ఇక్కడి నుంచి తీయాలని పినపోతు రవికుమార్ అడగ్గా మాటమాట పెరిగింది. రాంబాబు, భార్య సీత మరియు పినపోతు రవికుమార్, కుటుంబ సభ్యులు కర్రలతో దాడులకు పాల్పడ్డారు. ఇరువర్గాలు రాజోలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

తల్లిదండ్రులకు అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న బీవీసీ కళాశాల కరస్పాండెంట్ కృష్ణసతీష్

అమలాపురం రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన కోర్సులు, ఇతర అంశాలను వివరిస్తూ భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో అక్షర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జేఈఈ, ఎన్‌ఈఈటీ, ఈఏపీ సెట్ పరీక్షలపై కరస్పాండెంట్ బోనం కృష్ణసతీష్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. నాణ్యమైన విద్య కోసం కోనసీమ ప్రాంత విద్యార్థులు జిల్లాలు, రాష్ట్రాలు దాటిపోతున్నారన్నారు. విద్యారంగంలో మూడు దశాబ్దాల అనుభవం ఉన్న తాము నాణ్యమైన విద్యను కోనసీమ ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అక్షర్ విద్యా సంస్థలను స్థాపించామని తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ దుర్గారావు, స్కూలు ప్రిన్సిపాల్ స్మితాఆనందన్, వివిధ డిపార్టుమెంట్ల హెడ్‌లు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఉచిత పశువైద్య శిబిరం

రాజోలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మెరకపాలెంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ గిడుగు బుజ్జిబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంపదను సంరక్షించుకోవాలన్నారు. 50పశువులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని రాజోలు పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కె.రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో పొన్నమండ పశు వైద్యులు డాక్టర్ బి.సంపత్‌కుమార్, వీఎల్వో విజయశేఖర్, అడబాల సత్యరమేష్, గోపాల మిత్రలు డి.దుర్గారావు, ఎల్.సత్యనారాయణమూర్తి, ఏహెచ్‌ఏలు ఎం.సాయికుమార్‌రాజు, కె.కిరణ్‌కుమార్, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ

మలికిపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం దిండిమెరక మండలప్రాథమిక పాఠశాలకు నేతల సాయిబాబు, యడ్ల వెంకటలక్ష్మి రూ.20 వేలతో సమకూర్చిన ఇన్వర్టర్‌ను మంగళవారం పాఠశాలకు బహూకరించారు. విద్యుత్ లేని సమయాల్లో పాఠశాలలో ఇబ్బంది ఉండకూడదనే తలంపుతో అందించినట్లు దాతలు తెలిపారు. హెచ్‌ఎం ఎ.శ్రీనివాస్, ఎస్‌ఎంసీ చైర్మన్ నల్లి చిట్టిబాబు, ఉషారాణి, నవయూత్ సభ్యులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మలికిపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చింతల మోరి సర్పంచ్ డాక్టర్ రాపాక రమేష్‌బాబు అన్నారు. మంగళవారం చింతలమోరిలో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.సూర్యనారాయణరాజు, ఎంపీటీసీ సభ్యుడు తోటే రాజేష్, చవ్వాకుల వెంకటరత్నం, ఓగూరి మనోహర్, మైనం వెంకటస్వామిపాల్గొన్నారు.

కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం

పి.గన్నవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి కిశోర్‌వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి విజయశ్రీ అధ్యక్షతన వహించగా ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో కేవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు బాల్యవివాహాలు, పౌష్టికాహారం, సైబర్ క్రైమ్స్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.హెలీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనూష, మహిళా సంరక్షణ అధికారులు, ఏఎన్ఎంలు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో ఆక్రమణల తొలగింపునకు ప్రతిపాదనలు

మలికిపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో ఆక్రమణలకు గురైన డ్రెయిన్లను డ్రోన్ల ద్వారా సర్వే చేయడానికి రూ.35.70లక్షల అంచనాతో జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. నియోజకవర్గంలో ముంపునకు కారణం డ్రెయిన్లు ఆక్రమణలకు గురవ్వడమని, పూడిక తీయకపోవడం, పిచ్చిమొక్కలు పెరగడం, వశిష్ఠ గోదావరిలో రైల్వే బ్రిడ్జి పిల్లర్ల మధ్య అడ్డుకట్టు తీయకపోవడం వల్ల ముంపు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. డ్రోన్ల సహకారంతో డ్రెయిన్ల ఆక్రమణలు గుర్తించి తొలగించేందుకు ఒక ప్రణాళిక తయారు చేశామన్నారు. వీటి ఆమోదం కోసం జిల్లా కలెక్టర్‌ను కోరామన్నారు. దాళ్వాలో నియోజకవర్గంలో వరిసాగు 10వేల ఎకరాలకు పెంచాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ, తీర్థ మహోత్సవాలు వైభవంగా జరగడానికి అన్ని శాఖల అధికారులను సమన్వయ పరుచుకుని ముందుకు వెళుతున్నట్టు ఆయన చెప్పారు.

సిద్ధివినాయకుడిని దర్శించుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు



సిద్ధివినాయకస్వామిని దర్శించుకుంటున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

అయినవిల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. దర్శనం అనంతరం ఆయనకు అర్చకులు వేదాశీర్వచనంచేసి శేషవస్త్రంతో సత్కరించారు. ఆయన వెంట అసెంబ్లీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు కుడుపూడి చంద్ర, కొపనాతి రామచంద్రమూర్తి, విళ్ల దొరబాబు, మహిళా నేతలు యనమదల రాజ్యలక్ష్మి, ఆకుమర్తి బేబిరాణి, కొమరగిరి శ్రీనివాస్, కనకేశ్వరరావు, మిద్దె రవిరాజ్, యనమదల వెంకటరమణ, ముషిని సత్యనారాయణ, కుడుపూడి రామారావు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో పుట్టాలమ్మ తీర్థం

కె.గంగవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పామర్రు గ్రామ దేవత పుట్టాలమ్మ తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు, మొక్కులు చెల్లించారు.

'స్కౌట్ అండ్ గైడ్స్' సేవాభావాన్ని పెంపొందిస్తుంది

డీఈవో సలీంబాషా



శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

కాట్రేనికోన, జనవరి 28(ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందిస్తుందని డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. చెయ్యేరు ఇంజనీరింగు కళాశాలలో మంగళవారం పీఎంశ్రీ పాఠశాలల ఉపాధ్యాయులకు స్కౌట్ మాస్టర్స్ గైడ్ కెప్టెన్స్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర శిక్షణ ద్వారా పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ ట్రూప్స్ గైడ్ కంపెనీస్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో 26 పీఎంసీ పాఠశాలల నుంచి 52మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నట్టు కోర్సు డైరెక్టర్ పి.రాంబాబు తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయినీఉపాధ్యాయులు ప్రతి పాఠశాలలో 32మంది బాలురు, 32మంది బాలికలకు వేర్వేరుగా శిక్షణ ఇచ్చేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందిన వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో లీడర్ ఆఫ్ ది కోర్స్ బి.శివనాగిరెడ్డి, ఎల్టీ గైడ్ సుగుణారామచంద్రన్, స్టేట్ కోఆర్డినేటర్ కొణతాల రత్నకుమారి, గైడ్ కెప్టెన్ సుబ్బలక్ష్మి, ప్రెసిడెంట్ గైడ్ ఎల్లపు సోనీ, స్కౌట్ మాస్టర్ రామగోపాలరావు, కొణతాల రాజేందర్, ఆర్.రమేష్, కె.కృష్ణప్రసాద్, జి.సుబ్బరాజు, గైడ్ కెప్టెన్ దుర్గామాధవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు నమోదు చేసుకోవాలి

ముమ్మిడివరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ రెండు నైపుణ్య శిక్షణా కోర్సుల్లో అభ్యర్థులు చేరేందుకు నమోదు అవకాశం కల్పించిందని జిల్లా నైపుణ్య అధికారి డి.హరిశేషు తెలిపారు. డిజిటల్ భవిష్యత్తు కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఏఐఎసెండ్ కార్యక్రమంలో భాగంగా కృత్రిమ మేథ, సాంకేతికతతో రాణించడానికి ఇంజనీరింగ్ ద్వితీయ, తృతీయ సంవత్సరం డిగ్రీ, పాలిటెక్నికల్ చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. దీనికి ఈనెల30వతేదీలోపుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే డిజిటల్ 101 కార్యక్రమంలో చేరడానికి ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ చదివిన విద్యార్థులు అర్హులు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అన్వేషించడానికి డిజిటల్ యుగానికి సిద్ధం కావడానికి ఈ ప్రోగ్రాంను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబరు 9573583953 లేదా 9988853335లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎంపీటీసీల గౌరవ వేతనం మంజూరు చేయాలి

అంబాజీపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీల గౌరవవేతనాన్ని ప్రభుత్వం మంజూరు చేయాలని ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్న నేటికి ఎంపీటీసీలకు ఒక్క నెల గౌరవ వేతనం కూడా మంజూరు చేయలేదన్నారు. సర్పంచ్, ఎంపీటీసీలకు గౌరవ వేతనం పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, ఆ హామీపై నేటికి కూటమి నేతలు మాట్లాడంలేదన్నారు. ఎంపీటీసీల గౌరవ వేతనం మంజూరు చేసేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు చర్యలు తీసుకోవాలన్నారు.

వైద్య పరీక్షలు తప్పనిసరి

అంబాజీపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులున్న రోగులు ప్రతి నెల వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ సూచించారు. మాచవరంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. పలు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అలాగే మాచవరంలో కుష్టువ్యాధి సర్వేను కమ్యూనిటీ హెల్త్ అధికారి బి.అప్పారావు పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ సూర్యకుమారి, ఎంపీహెచ్‌ఏ మురళీకృష్ణ, ఏఎన్ఎం అర్జమ్మ, ఆశా భవాని పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో భక్తజనం సందడి

ఆత్రేయపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మం గళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్త లు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.1,37,655 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విశాఖకు చెం దిన సరిపల్లి లక్ష్మణ్, శివ రామరాజు కుటుంబ సభ్యులు రూ.50వేలు, భీమవరానికి చెందిన సుబ్బరాజు, జానికమ్మ దంపతులు రూ.25 వేలు విరాళాలు ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందించారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయాల్లో మంగళవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్వామివార్లను దర్శించుకున్నారు. అయా ఆలయాల వద్ద అర్చక బృందం వేదమంత్రాలతో ఆయనకుస్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వచనం పొందారు.

వెంకన్న ఆలయంలో భక్తజనం సందడి



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.1,37,655 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విశాఖకు చెందిన సరిపల్లి లక్ష్మణ్, శివరామరాజు కుటుంబ సభ్యులు రూ.50వేలు, భీమవరానికి చెందిన సుబ్బరాజు, జానికమ్మ దంపతులు రూ.25 వేలు విరాళాలు ఇచ్చారు. దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని అందించారు.

పెదన ఎమ్మెల్యే ప్రసాద్ పూజలు: వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయాల్లో మంగళవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్వామివార్లను దర్శించుకున్నారు. ఆయా ఆలయాల వద్ద అర్చక బృందం వేదమంత్రాలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివార్లను దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనం పొందారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను ఆయనకు అందించారు.



యర్రపోతవరంలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

ఉచిత పశువైద్య శిబిరంలో మందుల పంపిణీ

కె.గంగవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రపోతవరం, కోట గ్రామాల్లో మంగళవారం పశు ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో పశువైద్యులు సంయుక్త లక్ష్మి, కాశీ తదితర వైద్య సిబ్బంది పశువులకు పలు రకాల పరీక్షలు చేశారు. రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, సర్పంచ్ పిల్లి దొరబాబు, కూటమి నాయకులు దొమ్మేటి వెంకటేష్, కంచి ఆశీర్వాదం, ఆయా గ్రామాల ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



పసలపూడిలో వైద్య పరీక్షలు చేస్తున్న పీవీఆర్ ఆసుపత్రి వైద్యులు

పసలపూడి వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు

రాయవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కత్తుల సీతా మహాలక్ష్మి ప్రారంభించారు. శిబిరంలో పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ, నారాయణ రెడ్డి హాస్పిటల్స్ వైద్య బృందం డాక్టర్ మాధురి ఆధ్వర్యంలో వైద్య బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, షుగర్, చెవి, ముక్కు, గొంతు, సాధారణ వ్యాధులకు పరీక్షలు చేశారు. గ్రామానికి చెందిన వంద మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఆరుగురికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామసుందరం, ఆసుపత్రి సిబ్బంది ప్రకాష్, కోటి, మని, వంశీ, స్టీఫెన్, చిట్టి చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ



రాయవరం భాష్యం స్కూల్‌లో విద్యార్థికి బహుమతి అందిస్తున్న ఎంవీఐ

రాయవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని రామచంద్రపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం రాయవరం భాష్యం స్కూల్‌లో రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చునన్నారు. అనంత రం విద్యార్థులకు రోడ్డు భద్రత అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మిథూస్, సుమంత్ సాయి, త్రివిక్రమ్ బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్త, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన కిశోర్ బాలిక పథకంపై మాట్లాడుతున్న ఎంపీడీవో రాజు

బాలికల వ్యక్తిత్వ వికాసానికి సమష్టి కృషి చేయాలి

ఆలమూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కిశోర్ బాలికల వ్యక్తిత్వ వికాసానికి స్వయం సహాయక సంఘాలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో గజలక్ష్మి కోరారు. ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో కిశోర్‌బాలికల వికాసంపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజు, సీడీపీవో గజలక్ష్మి, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారిని సువక్షలానాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవోలు భమిడిపాటి అప్పాజీ, పీవీ సుబ్బరాజు, ఏపీఎం ఎం.ధనరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, వై.అరుంధతి, శ్రమ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ

ఆలమూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బందికి సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ ఇచ్చారు. మంగళవారం మండల కార్యాలయం వద్ద జరిగిన కిశోర్‌బాలిక శిక్షణ కార్యక్రమం అనంతరం ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి అధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టి.అబ్బులు ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ వల్ల రక్షణ పొందడానికి ఎంతో ఉపకరిస్తుందని ఆయన తెలిపారు.



అంగన్‌వాడీ సిబ్బందికి సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దు

అల్లవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాలు తెచ్చుకోవద్దని అమలాపురం రూరల్ సీఐ డి. ప్రశాంత్‌కుమార్ అన్నారు. అల్లవరం రవితేజ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ జి.హరీష్‌కుమార్, ప్రిన్సిపాల్ బళ్ల వెంకటరమణ పాల్గొన్నారు.

దాహం...దాహం

- నర్సన్నపేటలో తాగునీటి కష్టాలు
- అలంకారప్రాయంగా వాటర్ ట్యాంకు
- మూలనపడిన పైపులైన్లు

ఆత్రేయపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి కష్టాలు తలెత్తకుండా ఉండాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు రెండేళ్ల నుంచి నత్తనడకన నడుస్తున్నాయి. దీంతో శివారు ప్రాంత ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా చేపట్టిన పనులు అలానే ఉండిపోయాయి. శివారు ప్రాంత ప్రజలు కిలోమీటర్ల మేర నడిచివెళ్లి తాగునీరు తెచ్చుకుని గొంతు నింపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆత్రేయపురం శివారు నర్సన్నపేటలో సమీపంలో 300 కుటుంబాలు నివసిస్తున్నారు. వాటర్ పైపులైన్ లేకపోవడంతో బోరువేసి మంచినీటి కుళాయిల ద్వారా తాగునీరు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పైపులైన్లు దెబ్బతిని తాగునీటి జలాలు కలుషితమవుతున్నాయంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలజీవన్ పథకంలో నర్సన్నపేటలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి బోరు కూడా వేశారు. పైపులైన్లు వేయకపోవడంతో వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. పాత పంచాయతీ కూలగొట్టిన ప్రాంతంలో పైపులైన్లు నిరుపయోగంగా పడివున్నాయి. దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకు నిర్మించి ఏడాది కావస్తున్నా పైపులైన్ పనులు నేటికీ చేపట్టలేదు. దీంతో రానున్న వేసవిలో దాహార్తి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని వారు కోరుతున్నారు.





నర్సన్నపేటలో అలంకారప్రాయంగా మారిన రక్షిత మంచినీటి పథకం. పక్క చిత్రంలో మూలన పడేసిన మంచినీటి పైపులైన్లు



పోస్టల్‌శాఖ పొదుపు పథకాలపై ప్రచారం చేస్తున్న ఉద్యోగులు

పోస్టల్ శాఖ పథకాలపై ప్రచారం

మండపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖలో పొదుపు చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మండపేట పోస్టుమాస్టర్ ఎంవీ సుబ్బారెడ్డి అన్నారు. పోస్టల్‌శాఖ పొదుపు పథకాలపై మంగళవారం మారేడుబాక, మహిళానగర్, పార్వతినగర్ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు కేవీ నారాయణరావు, కొండపల్లి సూర్యనారాయణ, ఎండీఎం షరీఫ్, ఎ.అనూష, ఎస్.దుర్గాదేవి, సి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పొదుపు పథకాలపై మేళా: మండపేట పోస్టాఫీస్ కార్యాలయంలో నేటి సాయంత్రం తపాలా పొదుపు పథకాలపై ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నామని మండపేట, రామచంద్రపురం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పి.కామేశ్వరరావు తెలిపారు. మండపేటలో జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నీటి పంపిణీ కమిటీ కార్యవర్గం తొలి సమావేశం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 28(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నీటి పంపిణీ కమిటీ తొలి సమావేశం నీటిపారుదల శాఖ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో నూతనంగా ఎన్నికైన డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ నల్లమిలి సత్యనారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ జగన్నాథం, 6 నీటి వినియోగారుల సంఘాల చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తొలుత అధికారులతో పరిచయ కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, సభ్యులు, నీటి పారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ రామకృష్ణ, డీఈఈ వి.రమేష్, మాజీ డీసీ చైర్మన్ గరికిపాటి సూర్యనారాయణమూర్తి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



పాణింగపల్లిలో మాట్లాడుతున్న ఏవో రవి

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

కె.గంగవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): భూమి ఉన్న రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రామచంద్రపురం వ్యవసాయశాఖ ఏడీఏ ఏఎస్‌వీ రంగారావు, ఏవో బలుసు రవి అన్నారు. మంగళవారం మండలంలోని పాణింగపల్లి, సత్యవాడ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించిన వివరాలు తెలిపారు. దాళ్వా సాగులో ఎరువులు, పురుగుల మందుల వాడకంలో జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా కలశ శోభాయాత్ర

అమలాపురం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అమలాపురం విద్యుత్ నగర్‌లోని ఆదిశేషా నిలయంలో శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షోడసరాత్రి శ్రీశ్యామల నవరాత్రులను పురస్కరించుకుని మంగళవారం శ్యామలాదేవి చైతన్య కలశ శోభాయాత్ర నిర్వహించారు. అమలాపురం గ్రామ దేవత సుబ్బాలమ్మ ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పురవీధుల మీదుగా యజ్ఞశాల ప్రాంగణానికి చేరుకుంది. అనంతరం లఘు సర్వతోభద్ర వేదికపై 33మంది దేవతల ప్రతిష్ఠ నిర్వహించారు. గణపతి పూజతో నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. అఖండ జ్యోతి ప్రజ్వలన, కలశ స్థాపనతో 9రోజులపాటు ఒక్కొక్క దేవతకు పూజలు నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 12వ తేదీ వరకు నిర్విరామంగా 16 రోజుల పాటు యజ్ఞ యాగాది క్రతువులు జరుగుతాయని అక్షయపాత్ర వ్యవస్థాపకురాలు పి.నాగ కనకదుర్గ తెలిపారు.

శ్మశానవాటికల దుస్థితిపై కౌన్సిలర్ల ఆవేదన

రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీదేవి

రామచంద్రపురం(ద్రాక్షారామ) జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ఉన్న శ్మశానవాటిక దుస్థితికి సిగ్గుపడాలని 3వ వార్డు కౌన్సిలరు అంకం శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన పురపాలక సంఘ సమావేశ మందిరంలో జరిగింది. జనసేన కౌన్సిలరు అంకం శ్రీనివాస్ మాట్లాడుతూ పసలపూడి వద్ద స్వాగత ముఖ ద్వారం నిర్మాణం అంశంపై మాట్లాడారు. గతంలో హిందూ, క్రైస్తవ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించారని ఇప్పటి వరకు టెండర్లు పిలవలేదని ప్రశ్నించారు. పట్టణంలో శ్మశానవాటికల దుస్థితిపై కౌన్సిలర్లు వాడ్రేవు సాయిప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు మస్తాన్ మాట్లాడారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో జిమ్ సామగ్రి చెడిపోయాయని, వాకింగ్ ట్రాక్ శుభ్రపర్చడం లేదన్నారు. కౌన్సిలరు బావాల మంగామణి మాట్లాడుతూ తన వార్డులో స్వయం సంఘాల గ్రూపుల నిర్వహణ సక్రమంగా లేదని రుణాల మంజూరులో ఆర్పీ అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. ఇంటర్ నెట్ రూ.2.70 లక్షలు, 12 సమావేశాలకు రూ.2 లక్షలు ఖర్చు చేయడంపై వాడ్రేవు సాయిప్రసాద్ అభ్యంతరం తెలిపారు. వైఎస్ఆర్ నగర్‌లో ఇళ్లకు కుళాయి కనెక్షన్లకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇబ్బంది పెడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దరఖాస్తు చేసుకున్న వారికి కుళాయి కనెక్షన్లు ఇస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. సాధారణ సమావేశంలో 12, అత్యవసర సమావేశంలో 5 అంశాలు ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు కొలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కమిషన్ అయ్యప్పనాయుడు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మేజర్ డ్రైను నిర్మాణానికి భూమిపూజ

ద్రాక్షారామ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కందులపాలెం శివారు గొల్లల చెరువులో ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించనున్న మేజరు డ్రైను నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్, సర్పంచ్ పెంకె కృష్ణవేణి, ఎంపీటీసీ గుత్తుల అచ్యుతవేణి, వైట్ల హరికిషన్, వెంటపల్లి రామకృష్ణ, వెంటపల్లి శేషారావు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీ బోస్



వల్లూరులో రైతులకు మందులు అందిస్తున్న సర్పంచ్ మీనాకుమారి

పాడి రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి

కపిలేశ్వరపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వల్లూరు గ్రామ సర్పంచ్ సాకా దాసి మీనాకుమారి, టేకి గ్రామ సర్పంచ్ కె.నాగమణి అన్నారు. మంగళవారం మండలంలోని వల్లూరు, టేకి గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశుఆరోగ్య శిబిరాలను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈనెల 30 వరకు నిర్వహించే పశుఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ, గర్భకోశవ్యాధులు చికిత్సలు, కోళ్లకు టీకాలు, మందులు అందించారు. ఆయా గ్రామాల్లో 140 గేదెలు, ఆవులకు పరీక్షలు చేసినట్లు పశువైద్యాధికారులు డాక్టర్ వీవీ రమణమూర్తి, డాక్టర్ మాధురి తెలిపారు. కార్యక్రమాల్లో రైతులు, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు సంవిధాన్ గౌరవ అభియాన్‌పై అవగాహన

మండపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి) బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం వేగుళ్ల సూర్యారావు ఉన్నత పాఠశాలలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మద్దుల సుబ్బారావు సారథ్యంలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలిపారు. తొలుత అంబేడ్కర్, భరతమాత చిత్రపటాలతో విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి రావూరి బాబురావు, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు సందక వీర వెంకట సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాల మధ్య కొట్లాట... కేసులు నమోదు

అంతర్వేది: జనవరి 28(ఆంధ్రజ్యోతి): పాత గొడవల నేపథ్యంలో రెండు కుటుంబాల వారు కర్రలతో దాడులకు పాల్పడ్డారు. అంతర్వేది పల్లిపాలేనికి చెందిన కొల్లాటి రాంబాబు తన సైకిల్‌ను రోడ్డుగా అడ్డుగా పెట్టాడని, మోటార్ సైకిల్‌ను ఇక్కడి నుంచి తీయాలని పినపోతు రవికుమార్ అడగ్గా మాటమాట పెరిగింది. దీంతో రాంబాబు, భార్య సీత మరియు పినపోతు రవికుమార్, కుటుంబ సభ్యులు కర్రలతో దాడులకు పాల్పడ్డారు. ఇరువర్గాలు రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి పసలపూడిలో ఆలయ ప్రతిష్ఠ పూజలు

రాయవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి శివారు గోపడు తోటలో శ్రీభద్రావతి సమేత భావనారుషి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం పూజలు మంగళవారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. నేడు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విక్ వరుణం, యాగశాల ప్రవేశం, వాస్తుపూజ, గురువారం పంచగవ్య ఆరాధన, పంచగవ్య ప్రశనం, నవగ్రహ పూజ, ప్రధాన కుంభారోహణం, క్షీరాధి, జలాధివాసం, గ్రామోత్సవం, 31న ఉదయం విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.



పామర్రు పుట్టాలమ్మను దర్శించుకున్న భక్తులు

ఘనంగా పుట్టాలమ్మ తీర్థం

కె.గంగవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పామర్రు గ్రామ దేవత పుట్టాలమ్మ తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు, మొక్కుబడులు చెల్లించారు. పామర్రు, యండగండి, అముజూరు, కురకాళ్లపల్లి తదితర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



దాత సూర్యలక్ష్మికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో భవానీ

భీమేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు విరాళం

ద్రాక్షారామ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు రాజమహేంద్రవరానికి చెందిన చక్రావధానుల వెంకట సూర్యలక్ష్మి రూ.లక్ష విరాళం ఇచ్చారు. మంగళవారం దేవస్థానం కార్యాలయం వద్ద ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గాభవానికి విరాళం చెక్కు అందించారు. విరాళం అందించిన దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందచేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకుడు సూరపురెడ్డి వెంకటేశ్వరరావు, ఆలయ వేద పండితులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి పూజలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజగోపాల్ సెంటర్‌లోనున్న సీతారామభక్త వీరాంజనేయ స్వామిని మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన వెంకట రమణ, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ, ఉన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అక్కిరెడ్డి శ్రీను, దొడ్డ ప్రసాద్, పడాల బాబి తదితరులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. వైకుంఠ ఏకాదశి అనంతరం నిర్వహించే అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

ఆలమూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ పోలీసులు జరిపిన దాడుల్లో ఇద్దరిని సారా విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు. ఆలమూరు మండలం జొన్నాడ, మండపేట మండలం వెలగతోడు గ్రామాలకు చెందిన పడమటి వెంకటస్వామి, రేలంగి అప్పారావును అరెస్టు చేశామన్నారు. వీరిని ఆలమూరు కోర్టులో హాజరుపరచగా వారికి రిమాండ్ విధించినట్టు చెప్పారు. ఈ దాడులలో ఆలమూరు ఎస్ఐ రాంబాబుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో మంగళవారం సారా తయారీ స్థావరాలపై దాడులు చేశారు. బొబ్బర్లంక, గోదావరి మధ్యలో సారాకు ఉపయోగించే 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ కె.అన్నవరం తెలిపారు.